రేపటి నుంచి టెట్

హాజరు కానున్న 11,006 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 27 నుంచి మార్చి ఆరో తేదీ వరకు టెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఆరు కేంద్రాల్లో 11,006 మంది అభ్యర్థులు టెట్ పరీక్ష రాయనున్నారని తెలిపారు. బొబ్బిలిలోని స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కాలేజ్, విజయనగరంలో ఎంవిజిఆర్ కాలేజీ, సీతం కాలేజీ, ఐయాన్ డిజిటల్ జోన్, లెండి కాలేజ్, రాజాంలోని జిఎంఆర్ కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. పరీక్ష ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ జరిగే పరీక్షకు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు లేదా గుర్తింపు కార్డు తప్పకుండా రావాలని చెప్పారు. పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని తెలిపారు.

గజపతినగరంలో ర్యాలీ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, టిడిపి నాయకులు

టిడిపి, జనసేన ఉమ్మడి తొలి జాబితా విడుదలైన తరువాత జిల్లాలో అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. సీనియర్లకు ఎమ్మెల్యే సీటు కేటాయించకపోవడంతో కొంతమంది నాయకులు, కార్యకర్తలు అధిష్టానం తీరుపై మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు తనకు ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించాలని తన కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజుకు సీటు ఇవ్వాలని టిడిపి భోగాపురం మండల అధ్యక్షుడితో సహా ఇతర నాయకులు తమ పదవులకు రాజీనామా చేశారు. దాదాపు ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉంటూ పార్టీని బలోపేతం చేసి నాయకులు, కార్యకర్తలతో కలిసికట్టుగా ఉన్న సీనియర్ నాయకులను కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్లు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపిలో భగ్గుమన్న అసమ్మతి

గజపతినగరంలో తెలుగు తమ్ముళ్ల నిరసన ర్యాలీ

భోగాపురంలో పదవులకు నాయకుల రాజీనామా

ప్రజాశక్తి- భోగాపురం, గజపతినగరం

టిడిపి, జనసేన పొత్తు నేపథ్యంలో విడుదల చేసిన తొలి జాబితాలో జిల్లాలో రాజాం, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, బొబ్బిలి నియోజకవర్గాలకు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థులను పవన్, చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. టికెట్ ప్రకటించిన తరువాత విజయనగరం, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో ఎలాంటి గ్రూపుల పోరూ బయట పడకున్నా, గజపతినగరం, నెల్లిమర్లలో అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. చాలా కాలంగా పార్టీని నమ్ముకుని ఉన్న మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడుకు టికెట్ ఇవ్వకుండా, ఇటీవల వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చిన కొండపల్లి శ్రీనివాస్‌కు టికెట్ కేటాయించడంపై కె.ఎ.నాయుడుకు చెందిన గ్రూపు మండిపడుతోంది. ఇప్పటికే వారు తమ పదవులకు రాజీనామా చేశారు. తాజాగా గజపతినగరం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టి కెఎ నాయుడుకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నెల్లిమర్ల ఎమ్మెల్యే టికెట్‌ను పొత్తులో భాగంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోకం మాధవికి కేటాయించడంతో ఆమెకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వంతో పోరాటం చేసి ఎన్నో కేసులను భరించి పార్టీని బలోపేతం చేస్తూ వచ్చిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజును కాదని, జనసేనకు సీటు కేటాయించడంపై తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. ఈ నేపథ్యంలో టిడిపి భోగాపురం మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ మండలంలోని టిడిపి నాయకులు తమ పదవులకు ఆదివారం రాజీనామా చేశారు. కర్రోతుకు టికెట్ ఇవ్వకుండా జనసేనకు కేటాయించడాన్ని తాము జీర్ణించుకోలేక పోతున్నామని వెంటనే అధిష్టానం కలుగజేసుకుని అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. నెల్లిమర్లలో నగర పంచాయతీ, మండల నాయకులు సమావేశమై, అభ్యర్థిని మార్చకుంటే, మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని అధిష్టానానికి అల్టిమేటం జారీచేశారు.

అభ్యర్థిని మార్చకుంటే మూకుమ్మడి రాజీనామాలు

నెల్లిమర్ల : నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకపోతే పార్టీ పదవులకు మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని టిడిపి మండల, నగర పంచాయతీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సమావేశం నిర్వహించారు. నియోజక వర్గంలో పార్టీ బలంగా ఉందని, కర్రోతు బంగార్రాజు గెలుపు ఖాయమని తెలిసినా జనసేనకు టికెట్ ఎలా ఇస్తారని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ ప్రశ్నించారు. బంగార్రాజు టికెట్ కేటాయిస్తేనే పని చేస్తామని, లేకపోతే పార్టీ పదవులకు మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గేదెల రాజారావు, పోతల రాజప్పన్న, లెంక అప్పలనాయుడు, టిడిపి నగర పంచాయతీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరెడ్డి లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్రంగా పోటీకి సిద్ధం

నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్ కర్రోతు బంగార్రాజుకు కాకుండా పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించడంపై గుర్రుగా ఉన్న టిడిపి నాయకులు సోమవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వస్తున్న ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిసేందుకు సిద్ధమవుతున్నారు. చంద్రబాబును కలిసి రాజీనామాలు అందజేస్తామని టిడిపి భోగాపురం మండల అధ్యక్షులు కర్రోతు సత్య నారాయణ వెల్ల డించారు. పోలిపల్లిలో తన నివాసం వద్ద నాయకులతో సమావేశమైన ఆయన.. పార్టీ అధిష్టానం పునరాలోచన చేసి, అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే నియోజకవర్గ ఇన్‌ఛార్జి బంగార్రాజుతో స్వతంత్రంగా పోటీ చేయాలని ఒత్తిడి తీసుకు వస్తామని స్పష్టంచేశారు. బంగార్రాజు పోటీ చేయకపోతే తాను పోటీ చేస్తానని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు పిడుగు వెంకటసత్యం, బాబాజీ, నాయకులు పిడుగు తోటారావు, దాసరి అప్పలస్వామి, సరగడ తోగులురెడ్డి, నీలాపు అప్పలరామిరెడ్డి తదితరులు హాజరై, పార్టీ పదవులకు రాజీనామాలు చేశారు.



రాజీనామా పత్రాలను చూపిస్తున్న టిడిపి భోగాపురం మండల నాయకులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి కార్తీక్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

83.57 శాతం మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో 80 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పరీక్ష ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో సత్య ఇంజనీరింగ్ కళాశాల, గాయత్రీ కళాశాల, ఆర్.కె.డిగ్రీ కళాశాల తదితర పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తనిఖీ చేశారు. మొత్తం 25,181 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 21,043 మంది (83.57 శాతం) అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు డిఆర్ఒ ఎస్.డి.అనిత వెల్లడించారు. నగరంలోని గాయత్రీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 94.58 శాతం అత్యధిక హాజరు నమోదుకాగా, గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 61.46 శాతం అత్యల్ప హాజరు నమోదైంది.

పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎఎస్‌పి అస్మా

విజయనగరంకోట : విజయనగరం జిల్లా కేంద్రంలో ఎంఎస్ఎన్, శ్రీచైతన్య, పిఎస్ఆర్, ఆదిత్య పరీక్షా కేంద్రాలను ఎఎస్‌పి అస్మా ఫర్హీన్ సందర్శించారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బొబ్బిలి : పట్టణంలో గ్రూపు-2 పరీక్ష ప్రశాంతం ముగిసింది. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు, పోలీసులు హాల్ టికెట్లు, ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను పరిశీలించి అభ్యర్థులను లోపలికి అనుమతించారు. పట్టణంలో 18 కేంద్రాల్లో 4,825 మందికి గాను 3958 మంది హాజరయ్యారు.

బొబ్బిలి పట్టణంలోని రాజా కళాశాల వద్ద అభ్యర్థులు

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జెసి కార్తీక్, డిఎంహెచ్ఒ

క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరంకోట

నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్ట్ లో భాగంగా స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ప్రధాని మోడీ వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఆదివారం ప్రధాని గుజరాత్ రాష్ట్రంలోని రాజకోట్ నుండి దేశ వ్యాప్తంగా హెల్త్ కేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రారంభాలు, శంకుస్థాపనలు చేశారు. మన రాష్ట్రం లో 9 క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ కళాశాల నుండి లైవ్ టెలికాస్ట్ ద్వారా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఎంహెచ్ఒ భాస్కర రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అనేలా సునందిని, మెడికల్ ప్రొఫెసర్లు, విద్యార్థులు హాజరై వీక్షించారు. అనంతరం జెసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి హయాంలో విజయనగరంలో జరిగిన అభివృద్ధిని చూసి పార్టీని, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఆదివారం విజయనగరం నియోజకవర్గంలో సీనియర్ సిటిజన్లతో ఆత్మీయ సభను స్థానిక భాష్యం స్కూల్ వద్ద వైసిపి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో నగరం ఎలా ఉంది? తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలా ఉందో చూడాలన్నారు. నిరంతరం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తాను విద్యా శాఖ మంత్రిగా ఉండటంతో డ్రాపౌట్లు పెరిగాయని, నిరక్షరాస్యత పెరిగిందని ఇటీవల టిడిపి నేత అశోక్ గజపతిరాజు అవాస్తవాలు మాట్లాడటం దారుణమన్నారు. టిడిపి పాలనలో డ్రాపౌట్లు 26 శాతం ఉంటే, నేడు ఒక్క శాతం కూడా లేకుండా చేశామని తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రిగా అశోక్ గజపతిరాజు ఉండీ కూడా భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మించలేకపోయారని ఆక్షేపించారు. మరో రెండేళ్లలో విమానాశ్రయం నిర్మించి వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. మాన్సాస్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామంటూ అశోక్ ఆడిన డ్రామాలు ప్రజలు మరిచిపోరని వ్యాఖ్యానించారు. అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలు ప్రజలు గుర్తించాలని కోరారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చేటప్పటికి ఐదు రోజులకోసారి తాగునీరు వచ్చేదని, నేడు రోజు తప్పించి నీరు ఇవ్వడంతోపాటు 11 వాటర్ ట్యాంకులు నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చే ప్రయత్నం చేశామన్నారు. రోడ్లు, కాలువలు నిర్మించి, చెరువుల అభివృద్ధి, సుందరీకరణ చేశామని తెలిపారు. సీనియర్ సిటిజన్ పెద్దింటి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, నాయకులు కె.వి.సూర్యనారాయణ రాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నారాయణమూర్తి రాజు, పెద్దింటి రామారావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలి

జెడ్‌పి చైర్మన్‌కి యాదవుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని యాదవులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని యాదవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఆదివారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ 48 రోజులుగా విజయనగరం అసెంబ్లీ సీటును అన్ని రాజకీయ పార్టీలు యాదవులకే కేటాయించాలని ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోటీ చేయడానికి వినతి ఇచ్చిన బి.కాంతారావు యాదవ్, ముద్దాడ మధు యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో మూడు లక్షల మంది పైగా యాదవ ఓటు బ్యాంకు ఉందన్నారు. ఈసారి తమకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల గణేష్ యాదవ్, జిల్లా యువజన అధ్యక్షులు సతీష్ యాదవ్, కిశోర్ యాదవ్, నమ్మి ప్రసాద్ యాదవ్, బూర జగ్గారావు యాదవ్, కూర్మారావ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో బుద్ధి చెప్పాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపికి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలని టిడిపి విజయనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని గాజులరేగలో, మండలంలోని గుండాలపేటలో పర్యటించారు. టిడిపి సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని ఆమె తెలిపారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేసిందన్నారు, అభివృద్ధి అనేది మచ్చుకు కూడా కనపడటం లేదని చెప్పారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాక్షస పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు కనీసం నెలనెలా జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బిసి సెల్ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, జనసేన మండల నాయకులు బొబ్బాది చంద్రి నాయుడు, గౌరి, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్ ఈ ఏడాది నిర్వహించిన వివిధ సేవా, సంక్షేమ కార్యక్రమాలకు గాను జాతీయస్థాయి అవార్డు లభించింది. ఇన్నర్ వీల్ ఇండియా వెబ్‌సైట్‌లో గతేడాది డిసెంబర్ నెలాఖరు వరకు విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్ 100 కంటే ఎక్కువ సేవా ప్రాజెక్టులను చేసినందుకు ఆల్ ఇండియా స్థాయిలో టాప్‌గా నిలిచిందని క్లబ్ అధ్యక్షులు కాపుగంటి సుధ తెలిపారు. రాజమండ్రిలో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో వీల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సరిత లునాని చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుండా రామ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న క్లబ్ అధ్యక్షులు సుధ

బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాక్సింగ్ బాల, బాలికల ఎంపికలు రాజీవ్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎంపికలకు 70 మంది హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది బాలురను, నలుగురు బాలికలను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు మార్చి 1 నుంచి 3 వరకు విశాఖపట్నంలో జరిగే మూడో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథకుమార్, కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఇ రాజు, పిఎల్ ప్రసాద్, బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.జగదీష్ పాల్గొన్నారు.

3న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాగర్జన

విజయవంతం చేయాలని జెఎసి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి మూడో తేదిన విశాఖపట్నంలో వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మహాగర్జన నిర్వహిస్తున్నట్లు ఎపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా చైర్మన్ బి.కాంతారావు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు అధికారం మారుతున్నా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం విధానాల్లో మార్పు లేదన్నారు. ఉద్యోగులపై మరింత భారం అధికమైందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేక, జీవన ప్రమాణాలు పడిపోయి అల్లాడుతున్నారని వాపోయారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయకుండా వేతనాల పెంపుదలలో అన్యాయం చేశారన్నారు. అన్ని విభాగాల్లో పనిచేస్తున్న పదివేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని నిర్ణయించి, జిఒలు ఇచ్చి తంతు నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, అన్యాయం చేశారని తెలిపారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చినప్పుడు జీతాలు పెంచడమే గొప్ప విషయంగా చెప్పుకుంటున్నాయి తప్ప సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గాని, కార్మిక చట్టాలకు అనుకూలంగా గాని చేయడం లేదన్నారు. రెగ్యులర్, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత , గ్రాడ్యుటీ, పెన్షన్‌పై రాజకీయ పార్టీలు నిర్దిష్టంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే ఆందోళనకు కాంట్రాక్టు, అవట్ సోర్సింగ్, పార్ట్‌టైం, డైలీవేజ్, హెచ్ఆర్, గెస్ట్, అవర్ బేస్డ్, పిస్ రేట్ ఎంప్లాయిస్, తదితర పేర్లతో పిలుస్తున్న ఉద్యోగులంతా తరలిరావాలని కోరారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎపి కెజిబివి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ పి.తేజేశ్వరి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎసి జిల్లా చైర్మన్ కాంతారావు, తేజేశ్వరి

ప్రజాశక్తి
www.prajasakti.com



తయారు చేసిన ప్రాజెక్టుతో విద్యార్థులు

సైన్స్ పాత్ర కీలకం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నిత్యం జీవితంలో సైన్స్ పాత్ర కీలకమని దిశ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సాగి శాంతి కుమారి అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని దిశ పాఠశాలలో ఆదివారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ శాస్త్రీయ అంశాల్లో ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడుతుందన్నారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా స్కూల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరై ప్రాజెక్టులను తిలకించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరసవల్లి మౌనిక, తులసి, విద్యార్థులు పాల్గొన్నారు

సభలో మాట్లాడుతున్న వెంకట రామారావు

తెలగాలకు బిసి రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తెలగాలకు బిసి రిజర్వేషన్ కల్పించాలని, జాతినంతా ఒకే గొడుగు కిందకి తీసుకురావడమే తన మొదటి విజయంగా భావిస్తున్నానని తెలగా సంఘం నాయకులు పల్లంట్ల వెంకట రామారావు (పివిఆర్) అన్నారు. ఆదివారం పూసపాటిరేగలో తెలగాలను బిసిల్లో చేర్చాలంటూ నినాదంతో జరిగిన పివిఆర్ పాదయాత్ర విజయోత్సవ సభ జరిగింది. ఉత్తరాంధ్రలోని తెలగాలంతా వేల సంఖ్యలో హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలగాలకు బిసి రిజర్వేషన్ కల్పించాలంటూ ఇచ్చాపురం నుండి పాయకరావుపేట వరకూ 660 కిలోమీటర్లు పాదయాత్ర విజయవంతంగా సాగిందన్నారు. దానికి కారణం తన తెలగా కుటుంబమే అన్నారు. ఈ తన పాదయాత్రలో ఎన్నో విషాద గాదలు విన్నానన్నారు. రిజర్వేషన్ లేక తెలగా కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా చిదిగిపోయిన దృశ్యాలు కళ్లారా చూసానన్నారు. ఓ చెల్లి, ఓ తల్లి, ఓ తండ్రి వేదన విన్నానన్నారు. అందుకే తన ప్రాణం పోయినా పర్వాలేదుగాని తన జాతికి రిజర్వేషన్ కల్పించే వరకూ పోరాటం ఆపకూడదనే ఆలోచనకు వచ్చానన్నారు. 1961 వరకూ తాము బిసిలమని, తరువాత ఓసిలోకి మార్చి తమ తలరాతలు మార్చేసారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలోని తమ జాతి సొంతగా ప్రజాప్రతినిదులుగా గెలవలేదుగాని ఓడించే శక్తి మాత్రం తమకు ఉందన్నారు. అందుకే తమ నినాదాన్ని రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ మేనిఫెస్టోలో పెడుతుందో ఆపార్టీకే తమ మద్దతు ఇద్దామంటూ ప్రసంగించారు. తామంతా ఐక్యమత్యంగా ఉండి జెఎసి ఏర్పాటు చేసి ఈ విషయం ప్రతి ఎమ్మెల్యేకు వినతిరూపంలో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విక్రం జగన్నాథం, వైస్ ఎంపిపి అల్లాడ రమేష్, పుప్పాల లక్ష్మినారాయణ, మాజీ జెడ్పిటిసి ఆకిరి ప్రసాదరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాయిప్రసాద్

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం

ప్రజాశక్తి-పాలకొండ

ఎఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని, అందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని వస్తామని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు డి.సాయిప్రసాద్, మురళి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. ఆదివారం స్థానిక రామ డిగ్రీ కళాశాల ఆవరణలో హెల్త్ కార్యదర్శులతో ఢిల్లీశ్వరీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సచివాలయంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వీటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. డ్యూటీ సమయం సరిదిద్దాలని, యాప్స్ భారం తగ్గించాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఝాన్సీ, ప్రభావతి, పలువురు ఎఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

'జెఎసి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం'

ప్రజాశక్తి - వీరఘట్టం

లక్షలాది ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలను అనుకూలంగా నిలబడి పోరాటం చేయవలసిన ఎపి జేఏసీ ప్రభుత్వ నుండి ఎలాంటి స్పష్టత సాధించకుండానే ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ పిలుపును వాయిదా వేయడాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు వ్యతిరేకించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ జిఎల్ఐ, పీఎఫ్ తదితర ఆర్థిక బకాయిలు రూ.20 వేల కోట్లు ప్రభుత్వం నుంచి ఏ విధమైన స్పష్టత ఇవ్వకుండా ఎలా వాయిదా వేశారన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడం సభవు కాదని ఆయన అన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదవాలి

ప్రజాశక్తి - సీతంపేట

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలని, అప్పుడే ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు కూడా సాధించవచ్చునని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక కెజిబివి పాఠశాలను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థినిలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పరీక్షా సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా సిబ్బంది, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆహారపు అలవాట్లు పాటిస్తూ అనారోగ్యానికి గురి కాకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్లను భయభ్రాంతులకు గురిచేయొద్దు

ప్రజాశక్తి - కొమరాడ

టీచర్లకు నోటీసులిచ్చి భయభ్రాంతులు చేయడం మానుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న తమ సమస్యలపై శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లాలనుకుంటున్న ఉపాధ్యాయులకు పోలీస్ శాఖ వారు పాఠశాలలకు వెళ్లి నోటీసులు ఇచ్చి ముందస్తుగా భయభ్రాంతులను చేయడం చాలా అన్యాయమని అన్నారు. ఈరోజు ఉపాధ్యాయులే కాదు అంగన్వాడీ, ఆశా వర్కర్లకు కూడా గతంలో ఇంటి వద్ద నిర్బంధన అక్రమ అరెస్టులు చేశారన్నారు. వీటిపై భవిష్యత్తులో అన్ని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ లాంటి సందర్భంలో ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి ప్రజాసంఘాలు పూర్తిగా మద్దతు ఉంటుందని నాయకులు అన్నారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకుడు లక్ష్మను, ఎపి రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు ఉన్నారు.

ప్రకృతి సాగులో 'ఏటిఎం'

- తక్కువ స్థలంలో ఎక్కువ పంటలు
- అంతర్ పంటలుగా కూరగాయలు
- అధిక లాభాలు పొందుతున్న రైతు
- 23 మందికి పెరిగిన ప్రకృతి వ్యవసాయ రైతులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తిలో ఎటిఎం విధానం ద్వారా రైతు వేస్తున్న పంటలు ఆయనకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. నేలను నమ్ముకుని ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురుకు ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆ గ్రామానికి చెందిన గోకేడ నాయుడుబాబు. ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యకరమైన పంటలను పండిస్తూ ప్రణాళిక బద్ధకంగా ముందుకు సాగుతున్నాడు. ఈయనతో పాటు మండలంలోని 23 మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తూ లభాలు బాట పడుతున్నారు.

20 సెంట్లు..19 రకాల పంటలు..

నాయుడుబాబు తనకున్న 20 సెంట్లు స్థలంలో 19 రకాల పంటల సాగు చేస్తున్నాడు. రోజుల వ్యవధిలో ఒక్కో పంట చేతికి రావడంతో అమ్మకానికి సులువుగా ఉంటుందని అతను చెబుతున్నాడు. ఒకేసారి కాకుండా వారానికి, పది రోజులకు ఒక పంట చేతికి అందడంతో తనకు పంటను విక్రయించుకునేందుకు మంచి సమయం దొరుకుతుందని చెబుతున్నాడు. పంట వేసిన 30 రోజుల్లో మొదటగా ఆకుకూరలు కోతకు వస్తాయి. 40 రోజులకు దుంప జాతులు చేతికి అందుతాయి. 45 రోజులలో పందిరి జాతి కూరగాయలు, 60 రోజులలో మిరప పంట చేతికి అందుతుంది. 90 రోజులలో కేరెట్, బీట్రూట్‌లు పల సాయాన్ని

డ్రిప్ ద్వారా పంటను తడుపుతున్న రైతు నాయుడు బాబు

కూరగాయలను కోస్తున్న మహిళా రైతులు

అందిస్తున్నాయి. ఇలా పంట పంటకు మధ్య వారం రోజులు తేడా ఉండటంతో తనకు పనిచేయడంతో పాటు కోతకు కూడా సులువుగా ఉంటుందని చెబుతున్నాడు.

ఇంతకీ ఎటిఎం అంటే ఏమిటి?

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేసే విధానమే ఎటిఎం (అనంతపురం మోడల్ ఎనీ టైం మనీ, అన్నివేళలా ఆదాయం వచ్చే విధానం). ప్రకృతి వ్యవసాయాధికారుల సూచనలతో ఈ పద్ధతినే నాయుడు బాబు ఎంచుకున్నాడు. కేవలం ఇరవై సెంట్లు స్థలంలోని మామిడి మొక్కల మధ్యలో 19 రకాల కూరగాయలను అంతర్ పంటలుగా వేశారు. ఇందు కోసం నాలుగు అడుగుల వెడల్పు, అడుగు లోతు, 22 అడుగుల పొడవుతో పాడిలను ఏర్పాటు చేసి వీటిలో పశువుల గత్తంతో కూడిన ఘనజీవామృతాన్ని కలిపారు. కలిపిన విస్తీర్ణంలో కొత్తిమీర, పాలకూర, గోంగూర, తోటకూర చుక్కకూర, ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, బెండ, స్వీట్ కార్న్, బీర, ఆనబ, చిక్కుడు, కాకర, బరబాటి, బీన్స్, మిరప, బంతి పంటలు వేశారు. డ్రిప్పు విధానంతో స్పింకర్ల సహాయంతో నీటిని అందిస్తున్నారు.

ఖర్చు తక్కువే..

ప్రకృతి వ్యసాయ సాగుకు తక్కువ ఖర్చు అవుతుందని లాభాలు అధికంగా వస్తున్నాయని రైతు చెబుతున్నాడు. సాగు పనులకు కూలీలకు రూ.3400, ఘన జీవామృతం, పశువులకు రూ.3వేలు, విత్తనాలకు రూ.1800, జీవామృతానికి రూ. 800, ఇలా 20 సెంట్ల భూమిలో పంటలు వేసేందుకు మొత్తం రూ. 9వేలు ఖర్చు అయ్యింది. కూరగాయలు విడతల వారీగా చేతికి వస్తుండంటంతో ఎప్పటికప్పుడు సమీప మార్కెట్లో అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కూరలు ప్రతి 30 రోజులకు ఒకసారి రూ.5వేలు చొప్పున ఏడాదికి కేవలం కూరగాయలు ద్వారా రూ. 60వేలు, దుంప జాతులు 40 రోజులకు రూ.12వేలు చొప్పున ఏడాదికి రూ. 1.09లక్షలు, పందిరి జాతి కూరగాయలు 45 రోజులకు రూ.4వేల చొప్పున ఏడాదికి రూ.34,400, మిరప ద్వారా రూ.1200, క్యారెట్, బీట్ రూట్ 90 రోజులకు రూ. 8,900, బంతి పువ్వులు ద్వారా ఏడాదికి 1000 మొత్తం పంటల ద్వారా ఏడాదికి రూ. 2.13లక్షల ఆదాయం వచ్చినట్లు రైతు చెబుతున్నాడు.

ఎరువులను సిద్ధం చేస్తున్న రైతు

ప్రతి సోమవారం స్టాల్ ఏర్పాటు

మండలంలోని ఆరు యూనిట్లలో 23 మంది రైతులు ఎటిఎం విధానాన్ని అనుసరిస్తున్నారు. వీరు పండించే పంటలను ప్రతి సోమవారం వెలుగు కార్యాలయం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులతో పాటు స్పందన విభాగానికి వచ్చిన ప్రజల కూడా కొంటున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యం నిర్లక్ష్యం వీడి ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరశన సమ్మె ఆదివారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 2003 నుంచి ఉద్యోగులంతా హాస్పిటల్ అభివృద్ధిలో కీలకపాత్ర వహించి కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కుటుంబాలను, పిల్లలను వదిలి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలకపాత్ర వహించారన్నారు. అటువంటి ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయ కుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గ మన్నారు. వెంటనే ఈ నిర్లక్ష్యం వదిలి యూనియన్‌తో చర్చించి వేతన ఒప్పందం చేసి, బకాయి ఉన్న 7 డిఎలను ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జనవరి నెల జీతం వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. చిన్న చిన్న కారణాలు చూపి వసూలు చేసిన జరిమానాలను వెంటనే రికవరీ చేసి అకౌంట్‌లోకి వేయాలని, సస్పెండ్ చేసిన కామునాయుడును, అప్పలనాయుడులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లింపల్లి రామారావు, మిమ్స్ యూనియన్ నాయకులు నారాయణ రావు, బంగారునాయుడు, రాంబాబు, మధు, కామునాయుడు, గౌరీ, వరలక్ష్మి, వంశి, నాగభూషణం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్

వెలమలకు అధిక సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి- గజపతినగరం

ఉత్తరాంధ్రలో వెలమ సామాజిక వర్గానికి రాబోయే సార్వత్ర ఎన్నికల్లో 13 అసెంబ్లీ, 4 పార్లమెంటు స్థానాలలో అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని ఉత్తరాంధ్ర వెలమ కుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు చుక్క చినబాబు, బొత్స వరప్రసాద్, దొగ్గ దేముడు బాబు కోరారు. ఆదివారం గజపతినగరంలో ఉత్తరాంధ్ర వెలమసంక్షేమ సంఘం అధ్యక్షులు దొగ్గ దేముడు బాబు ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర వెలమకుల సంక్షేమ సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వెలమ కులస్తుల 32 లక్షల జనాభా ఉన్నామని చెప్పారు. నాలుగైదు రోజుల్లో అన్ని రాజకీయ పార్టీలు అధ్యక్షులను కలిసి వినత పత్రాలు సమర్పిస్తామన్నారు. సార్వత్ర ఎన్నికల్లో జనాభ దామాసా ప్రకారంగా సీట్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు గంట అప్పలనాయుడు, బండారు రామకృష్ణ, బొమ్మినేని తిరుపతినాయుడు, గుణుపూర్ రామారావు, బొత్స వరప్రసాద్, చలుమూరు నాయుడుబాబు, సీరంరెడ్డి సత్యనారాయణ, అన్నమనాయుడు, ధర్మాన రఘునాథమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

వాల్టా చట్టానికి తూట్లు

- పచ్చని చెట్లపై గొడ్డలి వేటు
- అనుమతుల్లేకుండా తొలగింపు
- ప్రయాణికులకు నీడ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్న శిర్లాం, రెడ్డి పేట, ఉంగరాడ మెట్ట, మజ్జి రాముడు పేటతో పాటు రాజాం -పాలకొండ ప్రధాన రహదారి పొడవునా రోడ్డుకిరువైపులా చెట్లను విద్యుత్ శాఖ పేరిట కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఆర్అండ్ బి అనుమతులు లేకుండా నరికి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఇప్పటికే వాతావరణంలో వాయు కాలుష్యం అధికంగా ఉండటంతో ప్రజలు ఎన్నో రోగాలు బారిన పడుతున్నారు. రెండు మొక్కలు నాటి అవసరం మేరకు ఒక చెట్టు నరికే విధంగా చూడాలని, అలా కాకుండా ఏకంగా కిలోమీటర్లు మేర రోడ్డుకి ఇరువైపులా నీడనిచ్చే పెద్ద, పెద్ద చెట్లు మిషన్లతో విద్యుత్ శాఖ సిబ్బంది నరికేయడం ప్రయాణికులు, పాదాచారులు పెదవి విరుస్తున్నారు. వేసవి కాలంలో ఎండలు తీవ్రతగా ఉంటాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నీడనిచ్చే ఈ చెట్లను నరికి వేయడంతో పాలకొండ, రాజాం ఇంటర్, డిగ్రీ ఉన్నత చదువులకు వెళ్తున్న విద్యార్థులు, ప్రయాణికులు, పాదాచారులు నిలువున నీడ లేక ఎండలోనే మగ్గిపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు నరకడంపై పలువురు ప్రయాణికులు విద్యుత్ శాఖ సిబ్బంది పై ఎందుకు చెట్లు కొడుతున్నారని ప్రశ్నించినప్పటికీ వారు టెంట్లు వేస్తామని ఎదురు ప్రశ్నలు వేయడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రధాన రహదారి గుండా చెట్లు నరికి వేయడం పట్ల నీడకు కరువయ్యామని ప్రయాణికులు విద్యుత్ శాఖ పై మండిపడుతున్నారు.

రోడ్డుపక్కనే నీడిచ్చే ఈ చెట్లనే నరికివేశారు

ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు కిరువైపులా ప్రయాణికుల నీడ కోసం వేసిన మొక్కలు పెరిగి పెద్దవి అయి నీడను ఇస్తున్న తరుణంలో వేసవిలో ఇలా చెట్లు నరికి వేయడం ఎంతవరకు సమంజసమని ఆవేదన చెందుతున్నారు. చెట్లు నరకడం పట్ల ఆర్ అండ్ బి అధికారులు విద్యుత్ శాఖ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు రోడ్డుకిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు.

చెట్లు నరకడం మాకు తెలియదు

పాలకొండ- రాజాం ప్రధాన రహదారి బూరాడ నుంచి సంకిలి వరకు రోడ్డు ఇరువైపులా చెట్లు నరికి వేయడం మాకేం తెలియదు. చెట్టు నరుకుతామని మమ్మల్ని ఎవరూ అనుమతులు కోరలేదు. పరిశీలిస్తాం. లేదంటే విలేకరిగా మీరే ఫోటో పెట్టండి. ఆ ఫోటో చూసి వెళ్తాం పరిశీలిస్తాం. లేకపోతే వెళ్ళం అని ఆర్అండ్‌బి జెఇ నాగభూషణం వ్యంగ్యంగా సమాధానమిచ్చారు.

విద్యుత్ వైర్లుపై పడిన కొమ్మలు తీయించాం

రోడ్డుకిరువైపులా చెట్లను కాకుండా విద్యుత్ వైర్లు పై పడిన కొమ్మలను మాత్రమే తీయమని సిబ్బందికి చెప్పాం. చెట్లు నరికేయడం మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అవసరమైన చోట మొక్కలు నాటుతాం.

హరి, విద్యుత్‌శాఖ ఇంచార్జి ఎఇ రేగిడి

రైతులపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి- బొబ్బిలి

వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని ఢిల్లీలో పోరాటం చేస్తున్న రైతులపై దాడి చేయడం దుర్మార్గమని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మ నాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుల పోరాటానికి స్పందించిన కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చి రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా తీసుకు రావాలని కోరారు.

నేడు మంత్రి బొత్స సమీక్ష

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మంత్రి బొత్స సత్యనారాయణ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖ అధికాలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని ఎంపిడిఒ ఎం. పావని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆమె కోరారు. ముఖ్యంగా గత సమీక్షలో లేవనెత్తిన సమస్యల పరిష్కారాలతో రావాలని సూచించారు.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పలు సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. బల్లంకి సచివాలయంలో 11 మంది సిబ్బందికి గాను డిఎ మోహన్ రావు, మహిళా కానిస్టేబుల్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సర్వేయరు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, జెఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంకెఆర్‌పురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వెంకటరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విధుల్లో ఉన్నారు. నలుగురు ఇన్చార్జీలు, వెటర్నరీ పోస్ట్ ఖాళీగా ఉంది. పూర్తిస్థాయిలో సచివాలయాల్లో సిబ్బంది నియామకం జరగకపోవడంతో ప్రజలకు సకాలంలో సేవలందడం లేదు. సచివాలయానికి అవసరాలపై వచ్చిన ప్రజలకు సమాధానం చెప్పలేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి ప్రజలకు సకాలంలో సేవలందించాలని కోరుతున్నారు.

అందుబాటులో ఉన్న ఒకేఒక్క ఉద్యోగి

పనులు ప్రారంభించరే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎన్‌కేఆర్‌పురంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరై నాలుగేళ్లవుతున్నా ఇంత వరకూ పనులు ప్రారంభించలేదు. దీంతో రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని చెబుతున్నారు. గ్రామానికి చెందిన వివి చినరామ నాయుడు డిసిసిబి చైర్మన్‌గా ఉన్నారని, ఇదే గ్రామానికి చెందిన ఎం. కసూర్తి ఎఎంసి చైర్‌పర్సన్‌గా, వేచలపు రామ్మూర్తినాయుడు కో-ఆపరేటివ్ డైరెక్టర్ ఉన్నారని ఇంత మంది ఉన్నప్పటికీ గ్రామాభివృద్ధి జరగడం లేదని రైతులు వాపోతున్నారు. రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కూడా ఎంపిక చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై పెదవి విరస్తున్నారు.

ఆర్‌బికె నిర్మాణానికి కేటాయించిన స్థలం

బిసిలకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి- బొబ్బిలి

జయహో బీసీ అంటూ టిడిపి టికెట్లు కేటాయింపులో చంద్రబాబు బిసిలకు అన్యాయం చేస్తున్నా రని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసిలను ఉద్ధరిస్తామని జయహో బిసి అంటున్న చంద్రబాబు అనేక నియోజకవర్గాల్లో బిసిలకు అన్యాయం చేశారని విమర్శించారు. గతంలో తనను పక్కన పెట్టిన చంద్రబాబు నేడు అనేక మంది సీనియర్లను పక్కన పెట్టారని విమర్శించారు. టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను హడావిడిగా ప్రకటించారన్నారు. టికెట్లు రాని అభ్యర్థులు నిరసనలకు దిగడం చూస్తే టీడీపీకు ఓటమి భయం పట్టుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ 175 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. ఆయనతో బాడంగి జడ్పీటీసీ పి.రామారావు ఉన్నారు.

సిపిఎం సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి పై నడక వంతెన, అండర్ బ్రిడ్జి లోపల ఫుట్పాత్ ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు గాడి అప్పారావు ఆదివారం సంతకాలు సేకరణ చేపట్టారు. రైల్వే అండర్ బ్రిడ్జి లోపల వాహనాచోధకులు, పాదచారులచే సంతకాలు సేకరణ చేపట్టారు. కొత్తవలస రైల్వే స్టేషన్ సందర్శనకు విచ్చేస్తున్న రైల్వే జీఎం, రైల్వే డిఆర్ఎమ్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు సంతకాలు సేకరణ చేపట్టినట్టు అప్పారావు తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి గుండా వెళుతున్న వాహన చోదకులు ప్రతి రోజు ఇబ్బందులు పాలవుతున్నారని, ఈ సమస్యను గుర్తించి రైల్వే ఉన్నతాధికారులు తగిన చొరవ చూపాలని కోరారు. రైల్వే అధికారులు చొరవ చూపి తమ విన్నపాన్ని మన్నించి, ఫుట్పాత్ ఏర్పాటు చేస్తారని కోరారు.

సంతకాలు సేకరిస్తున్న అప్పారావు

'చలో అసెంబ్లీ వాయిదా సమంజసం కాదు'

ప్రజాశక్తి- బొబ్బిలి

15 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాల్సిన ఎపి జెఎసి ఒంటెద్దు పోకడతో ఎలాంటి స్పష్టత ప్రభుత్వం నుండి పొందకుండా 27వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర జె ఏసి నాయకులు ప్రకటించటం సమంజసం కాదని ఎపిటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని సంఘం రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో మండల నాయకులతో జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులంతా జెఏసి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమ స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సిన ఏపి జెఏసి ఉద్యమంపై నీళ్లు చల్లేలా వాయిదా ప్రకటనలు చేయటం లక్షలాది ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేయడ మేనని అన్నారు. జెసి రాజు మాట్లాడుతూ రూ.20కోట్ల ఆర్థిక బకాయిలపై, 2004 ముందు నియామక మైన వారికి పాత పింఛను అమలు, పిఆర్‌సి బకాయిలపై ఏవిధమైన స్పష్టత లేకుండా అర్థంతరంగా వాయిదా వేయడం లక్షలాది మంది ఉద్యోగులను, ఉపాధ్యాయులను తప్పుదోవ పట్టిం చటమేనని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్, ఎల్లయ్య, లక్ష్మణ రావు, శ్రీను, మోహన రావు, భక్త దర్శనం, ప్రసాద్, పరిసినాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజు

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మద్యానికి బానిసై ఒక గిరిజన యువకుడు శనివారం అర్ధరాత్రి మద్యం మత్తులో మందు అనుకుని పురుగు మందు తాటి మృతి చెందాడు. మండలంలోని పి.ఆమిటి పంచాయతీ, కారివలస గ్రామానికి చెందిన మండంగి రమేష్ (38) ప్రతిరోజు మద్యం సేవిస్తుండే వాడు. ప్రతిరోజు లాగే శనివారం కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అయితే తన భార్య సుహాసిని మద్యం సేవించడం ఆపాలని కోరగా మరల మద్యం తాగి, ఆ మద్యం మత్తులో పురుగుమందును కూడా సేవించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రమేష్‌ను శనివారం రాత్రి భద్రగిరి సిహెచ్‌సికి తీసుకువచ్చారు. ఆసుపత్రి సిబ్బంది పరీక్ష చేయగా మధ్యలోనే రమేష్ మృతి చెందినట్లు చెప్పారు.